క్లుప్తంగా

2న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

తిరువూరు: తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అరుణాచలానికి తిరువూరు ఆర్టీసీ డిపో నుంచి జూన్ 2న ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజరు వేణు తెలిపారు. 2న సాయంత్రం 5 గంటలకు తిరువూరులో బయల్దేరి 3వ తేదీ ఉదయం శ్రీకాళహస్తి చేరుతుందని పేర్కొన్నారు. అనంతరం శ్రీనివాస మంగాపురం, కాణిపాకం, శ్రీపురంల మీదుగా 4వ తేదీ మధ్యాహ్నం అరుణాచలం చేరుతుందని తెలిపారు. టికెట్ ధర రానుపోను రూ.2800గా నిర్ణయించామని పేర్కొన్నారు. ఆన్‌లైన్లో టికెట్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు 98856 61835లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

వెల్వదం(మైలవరం): మైలవరం మండలంలో పారిశుద్ధ్య నిర్వహణ పనులు పంచాయతీ కార్మికులు శనివారం ముమ్మరంగా చేపట్టారు. మండలంలోని గ్రామాల్లో డ్రెయినేజీల్లో పూడిక తీత పనులు, రోడ్లపై చెత్త తొలగింపు పనులు చేపట్టారు. వెల్వడం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు దగ్గర ఉండి పనులు పర్యవేక్షించారు. మైలవరం, పుల్లూరు, చంద్రాల, గణపవరం గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పనులు పర్యవేక్షించారు.

25న ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా మహాసభ

మైలవరం: ఉమ్మడి కృష్ణా జిల్లాల ఎమ్మార్పీఎస్ మహాసభ మైలవరం నియోజకవర్గం ఇబ్రహీంపట్నం మండలంలో ఈ నెల 25న నిర్వహించనున్నట్లు ఆ సంఘ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంకొల్లు జమలయ్య శనివారం తెలిపారు. ఈ మహాసభకు మందా కృష్ణ మాదిగ హాజరవుతారని పేర్కొన్నారు. ప్రతి గ్రామం నుంచి మహాసభకు అధిక సంఖ్యలో అభిమానులు హాజరువాలని కోరారు.

వ్యర్థాల రీసైక్లింగ్‌కు సహకరించాలి

తిరువూరు: తిరువూరు నగరపంచాయతీ పరిధిలోని 9వ వార్డులో ప్లాస్టిక్ తదితర వ్యర్థ పదార్థాల రీసైక్లింగ్‌కు ప్రవేశపెట్టిన ఆర్‌ఆర్‌ఆర్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని వార్డు కౌన్సిలర్ మూడు దుర్గారావు కోరారు. వార్డులో రెడ్యూస్ రీయూజ్, రీసైకిల్ విధానంపై సచివాలయ సిబ్బంది శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇళ్లలో వినియోగించని దుస్తులు, బూట్లు, చెప్పులు, ప్లాస్టిక్ వస్తువులు, ఈ రీసైక్లింగ్ యూనిట్‌కు అప్పగిస్తే పర్యావరణ కాలుష్యం నివారించవచ్చని తెలిపారు.

వార్డుల్లో పర్యటించిన మున్సిపల్ కమిషనర్



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు శనివారం విస్తృతంగా పర్యటించారు. వివిధ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం పనులు, డ్రైనేజీల్లో మురుగునీరు పారుదల, వీధిలైట్లు నిర్వాహణ పరిశీలించారు. ఆయా విభాగాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమస్య కనిపించిన వెంటనే పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజల చెప్పే వరకు ఎదురు చూడొద్దన్నారు. తాగునీరు, వీధిలైట్లు నిర్వాహణపై దృష్టి సారించాలన్నారు. ఆయా ప్రాంతాల్లోని చెత్త ఏరివేసి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించారు.

ఉపాధి కూలీ మృతి



అక్కమ్మ (ఫైల్)

రెడ్డిగూడెం: మండలంలోని శ్రీరామపురం గ్రామానికి చెందిన గురిజాల అక్కమ్మ(58) శనివారం ఉపాధి హామీ పనికి వెళ్లి, పనిచేస్తున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. సమీపంలోని కూలీలు ఆమెను వెంటనే విస్సన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా ప్రభుత్వం నుంచి రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేయనున్నట్లు ఏపీఓ భాస్కర్ తెలిపారు.

ఉపాధి హామీ కూలీకి వడదెబ్బ



వడదెబ్బకు గురైన వ్యక్తి

చాట్రాయి: ఉపాధి పనులు చేస్తూ ఓ వృద్ధుడు వడదెబ్బకు గురై స్పృహతప్పి పడిపోయాడు. మండలంలోని చిననంపేట గ్రామానికి చెందిన మోదీన్ సాహెబ్ అదే వృద్ధుడు గ్రామంలోని మంగయ్యగారి చెరువులో శనివారం ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలాడు. పక్కనే ఉన్న కూలీలు వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఎండను తట్టుకునేందుకు కూలీలకు సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం ప్రభుత్వాన్ని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ఎమ్మెల్యే రక్షణనిధి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

గంపలగూడెం: గంపలగూడెం సచివాలయం-1 పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి తెలిపారు. గంపలగూడెం-1 సచివాలయం పరిధిలో శనివారం మూడో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం పరిధిలోని ఈబీసీ కాలనీ, కాపు కల్యాణ మండపం బజారు, పేటబాపయ్య వీధి, జెండారావి చెట్టు బజారు, గాంధీ సెంటర్ నుంచి పార్థసారథి సెంటర్ వరకు, గ్రంథాలయం ఎదుట వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు ఎమ్మెల్యే వివరిస్తూ కార్యక్రమం కొనసాగించారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల విజ్ఞప్తి మేర సచివాలయం గ్రాంటు రూ.20 లక్షలను తాగునీటి వసతి పెంపొందించేందుకు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రతి అక్క, చెల్లి, అన్న, తమ్ముడుకు ప్రయోజనం కల్పించాలన్నదే లక్ష్యంగా కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అర్హత కల్గిన ప్రతి ఇంటికీ ఏదో ఒక సంక్షేమాన్ని అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత సచివాలయం పరిధిలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా 2,382 మంది లబ్ధిదారులకు వారి బ్యాంక్ అకౌంట్లలో నేరుగా రూ.14.58 కోట్లు జమచేసినట్లు వివరించారు. అభివృద్ధి పథకాల కింద రూ.2.40కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. కాలనీ గృహాలు మంజూరు చేయాలని, అంతర్గత రహదార్ల అభివృద్ధిపర్చాలని పలువురు కోరారు. ఎంపీపీ జీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కే శామ్యూల్, ఎంపీటీసీ సభ్యురాలు కే లావణ్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, పట్టణశాఖ అధ్యక్షుడు కొత్తగుండ్ల నరసింహారావు, జిల్లా కమిటీ సభ్యులు జీ చెన్నకేశవరెడ్డి, కొత్తగుండ్ల వంశీ, మాజీ ఎంపీపీ కే దాసు, సొసైటీ మాజీ అధ్యక్షుడు ఏ కృష్ణారెడ్డి, నాయకులు ఏ శ్రీనివాసాచారి, కే కోటేశ్వరరావు, హరికృష్ణ, ఏ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలపై మాట్లాడే హక్కు చంద్రబాబుకు లేదు



నిరసన ప్రదర్శనలో వైఎస్సార్ సీపీ నాయకులు, ఇళ్ల స్థలాల లబ్ధిదారులు

మైలవరం: పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయింపు గురించి మాట్లాడే హక్కు చంద్రబాబుకు లేదని ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలపై ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మైలవరంలో వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పిలుపు మేరకు మైలవరంలోని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పాత యూనియన్ బ్యాంక్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాల వరకు భారీ ర్యాలీ నిర్వహించి, కొద్ది సేపు జాతీయ రహదారిపై బైఠాయించి చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, మైనారిటీలకు, బడుగు, బలహీన వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమరావతిలో ఇళ్ల స్థలాలు ఇస్తుంటే చంద్రబాబు ఓర్వలేక పోతున్నాడని తెలిపారు. చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఎన్టీఆర్‌జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలో ఉన్నంత కాలం ఏనాడూ కనీసం ఒక సెంటు భూమి కూడా కొనుగోలు చేసి, పేదలకు పంచి ఇవ్వలేదన్నారు. ఇటువంటి వ్యక్తులు పేదల ఇళ్ళ స్థలాల గురించి మాట్లాడుతూంటే దెయ్యాలు వేదాలు వల్లించిన చందంగా ఉందన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు

ఎమ్మెల్యే రక్షణనిధి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రక్షణనిధి

ఏ.కొండూరు: కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి పేర్కొన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ కేంద్రాన్ని శనివారం వైద్య ఆరోగ్యశాఖమంత్రి విడదల రజని, ఎమ్మెల్యే కే రక్షణనిధి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో కిడ్నీ బాధితులకు గత టీడీపీ ప్రభుత్వం చేయలేని పనులు జగనన్న ప్రభుత్వంలో చేసి చూపిస్తున్నామన్నారు. కమిటీల ప్రభుత్వం పోయి ప్రజా ప్రభుత్వం వచ్చిందన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమి లేదని టీడీపీ నాయకులు చెప్పడం హాస్యస్పదంగా ఉందన్నారు. రూ.350కోట్లతో అభివృద్ధి చేశామని తెలిపారు. రూ. 1,400 కోట్లతో పలు రకాల ప్రభుత్వ పథకాలు అందించామన్నారు. స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో గ్రామాల్లో 10 ఆర్వోప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో 50 సిన్‌టెక్స్ ట్యాంకులు ఏర్పాటు చేసి ట్రాక్టర్ల ద్వారా కృష్ణా జలాలు సరఫరా చేస్తున్నామని తెలిపారు. శాశ్వత పరిష్కారానికి రూ.39కోట్లతో కృష్ణాజలాలు ఇంటింటికీ త్వరలో అందిస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 96 మందికి డయాలసిస్ చేయిస్తున్నామని వారికి ప్రతి నెలా రూ. 10 వేలు పింఛన్ కూడా ఇస్తున్నామన్నారు. మంత్రి విడదల రజని ఆదేశాల మేరకు ఈ మండలంలో మూడు యూనిట్ల డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. డయాలసిస్ రోగులు దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఈ కేంద్రంలో వైద్యం చేయించుకునే వేసులుబాటు కల్పించామన్నారు. డయాలసిస్ కేంద్రం పనులు త్వరితగతిన పూర్తి కావటానికి సహకరించిన జిల్లా కలెక్టర్ ఢిల్లీరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వి.రజని, ఎంపీపీ కే నాగలక్ష్మి, జెడ్పీటీసీ బి.గనియా, వైస్ ఎంపీపీలు గుంటక శివారెడ్డి, పద్మ, ఆర్డీఓ వైవీ ప్రసన్నలక్ష్మి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యోగులు వేసవి జాగ్రత్తలు పాటించండి

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు వేసవిలో తగిన జాగ్రత్తలు పాటించాలని డిపో మేనేజర్ ఏ సుబ్రహ్మణ్యం కోరారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా ఉండేందుకు అప్పుడప్పుడు ఓఆర్ఎస్ పౌడర్ కలిపిన నీటిని తాగాలన్నారు. ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అందజేసిన ఓఆర్ఎస్ ప్యాకెట్లు శనివారం ఆయన ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓఆర్ఎస్ నీటితో పాటు కొబ్బరినీరు, మజ్జిగ తరుచుగా తీసుకోవాలన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్త వహించాలి

తిరువూరు: వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా వడదెబ్బ తగలకుండా ప్రతిఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలని తిరువూరు అమరావతి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యురాలు కావ్య సూచించారు. శనివారం ఆస్పత్రిలో వడదెబ్బ తీవ్రత, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన సమావేశం నిర్వహించారు. అవసరమైతేనే ఎండలో బయటికి వెళ్లాలన్నారు. గొడుగు లేదా తలపై ఆచ్ఛాదనంతో మాత్రమే ఎండలో వెళ్లాని సూచించారు. నీరసం, కాళ్లు, చేతులు, తలనొప్పి, ఒకేసారి శరీర ఉష్ణోగ్రత పెరగడం, దాహం వేయడం వంటి లక్షణాలు కనిపిస్తే వడదెబ్బ తగిలినట్లు గుర్తించాలన్నారు. వెంటనే ఆస్పత్రిలో చేరి వైద్యచికిత్స పొందాలని కోరారు. డాక్టర్ సాదిక్, డాక్టర్ ధరణేంద్ర పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: పట్టణంలోని 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ డీ కృష్ణనాయక్ శనివారం చెప్పారు. తిరువూరు రోడ్డు, పెద్దగాంధీబొమ్మ, చిన్నగాంధీబొమ్మ సెంటర్, బ్యాంకు స్ట్రీట్, ఎంప్లాయీస్ కాలనీ, పొట్టి శ్రీరాములు బొమ్మ సెంటర్, జంక్షన్ రోడ్డు, అమ్మవారితోట, మొఘల్ చెరువు, ఆర్‌ఆర్‌పేట, ఆటోనగర్, అయ్యప్పస్వామి టెంపుల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

సమ్మర్ క్యాంప్‌లో ఆటల పోటీలు



చాట్రాయి: మండలంలోని చనుబండ, చాట్రాయి గ్రామాల్లోని గ్రంథాలయాల్లో శనివారం నిర్వహించిన సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులకు క్యారమ్స్, తెలుగు గ్రామర్ నేర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు శ్రీకాంత్, మణికంఠ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితుడికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



అగ్ని ప్రమాద బాధితుడ్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

మేడూరు(గంపలగూడెం): మండలంలోని మేడూరులో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితుడికి తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి శనివారం రూ. 10వేల సాయం అందజేశారు. గ్రామానికి చెందిన కోట ఏసోబు ఇల్లు కాలి నిరాశ్రయుడైన విషయం విదితమే. దీంతో ఎమ్మెల్యే గ్రామానికి వెళ్లి బాధితుడ్ని పరామర్శించారు. ప్రభుత్వంపరంగా తగిన సాయం అందేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీపీ జీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కే శామ్యూల్, సర్పంచ్ జి.లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ కాలనీలో వాటర్ ట్యాంక్‌లకు మరమ్మతులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రూరల్ మండలం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలఓ గొల్లపూడి 10వ సెగ్మెంట్ పరిధిలోని పలు బ్లాకులలో పగిలిపోయి పెద్ద ఎత్తున లీకవుతున్న సింటెక్స్ వాటర్ ట్యాంక్‌లకు మరమ్మతులు ప్రారంభించడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పదో సెగ్మెంట్ పరిధిలో 207, 219, 227 బ్లాకులపై ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌లు పగిలాయి. దీంతో తాగునీటికి ప్రజలు పడుతున్న ఇబ్బందులను మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లామని స్థానిక ఎంపీటీసీ షేక్ సైదాబీ, ఆమె భర్త హిమవలి తెలిపారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తన సొంత ఖర్చులతో ఆయా వాటర్ ట్యాంక్‌లకు శనివారం మరమ్మతులు చేయిస్తున్నారని వారు వివరించారు. వాటర్ ట్యాంక్‌లకు మరమ్మతులు చేయించి తాగునీటి కొరత లేకుండా చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

వైజ్ఞానిక స్పృహతో సామాజిక అవగాహన



మాట్లాడుతున్న కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత దేవరాజు మహారాజు

కృష్ణలంక(విజయవాడతూర్పు): వైజ్ఞానిక స్పృహ ఉన్నవారే సామాజిక అవగాహనతో సాగుతారని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ దేవరాజు మహారాజు అన్నారు. మానవాళి ప్రయోజనాల కోసం సాగించే పరిశోధనలు విస్తృతం కావాలన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో శనివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేంద్రం ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎంపీ పి.మధు అధ్యక్షతన నిత్య జీవితంలో వైజ్ఞానిక స్పృహ అనే అంశంపై సభ నిర్వహించారు. దేవరాజు మాట్లాడుతూ శాస్త్రీయ పరిశోధనలకు వర్తమానంలో ప్రాధాన్యం దక్కడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ల సాయంతో ఉన్నత విద్యా సంస్థలు నడుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం చెప్పడం విచారకరమన్నారు. దేవాలయాల్లో కూడా సైన్స్ ఆధారంగానే కార్యక్రమాలు జరుగుతున్నాయని వివరించారు. సూర్య కేంద్ర సిద్ధాంతాన్ని కూడా తప్పుబట్టిన సమాజం ఒకనాడు ఉండేదన్నారు. కార్పొరేట్ విద్య కారణంగా పిల్లల్లో ప్రశ్నించే తత్వం తగ్గుతోందన్నారు. నిచ్చెనమెట్ల వ్యవస్థ కొనసాగుతున్న దేశంలో వైజ్ఞానిక స్పృహ అవసరం ఎక్కువగా ఉందన్నారు. కర్ణాటక ఎన్నికల్లో మానవత్వాన్ని తుంచేసే శక్తులపై ప్రజలను అప్రమత్తం చేసిన ప్రజాసంఘాల పాత్ర గుర్తించాలన్నారు. సామూహిక చైతన్యం పెంచడం ప్రజా సంఘాలుగా ఆలోచించాలన్నారు. అమరావతి బాలోత్సవ కమిటీ అధ్యక్షుడు ఎస్.పి.రామరాజు, ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ, ఇన్‌చార్జి బి.ఆర్.తులసీరావు, టి.క్రాంతికిరణ్, యు.వి. రామరాజు పాల్గొన్నారు.

భూమి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఆగిరిపల్లి: మండలంలోని మల్లేశ్వరం రెవెన్యూలో సర్వే నంబర్ 242/2లో గల 17.62 ఎకరాల దొంగలోడి కుంట చెరువు పోరంబోకు భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆగిరిపల్లి-1 ఎంపీటీసీ సభ్యుడు షేక్ షంసున్ అధికారులను శనివారం కోరారు. సహజ సిద్ధంగా ఏర్పడిన కుంటను కొంత మంది వ్యక్తులు కబ్జా చేసి దర్జాగా అనుభవిస్తున్నారని, దీనిపై హైకోర్టుకు వెళితే కబ్జాదారులు కోర్టును తప్పు దోవపట్టించారని ఆరోపించారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రేపు నూజివీడులో వలంటీర్లకు సత్కారం

నూజివీడు: మండలం, పట్టణంలోని వలంటీర్లకు ఈనెల 22న స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వలంటీర్లను సత్కరించడంతోపాటు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర నగదు ప్రోత్సహకాలను అందజేయనున్నట్లు ఎంపీడీవో ఎల్ అలీఖాన్ తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పాల్గొని నగదు ప్రోత్సాహకాలను అందజేస్తారన్నారు. కార్యక్రమంలో మండలంలోని, పట్టణంలోని ప్రజాప్రతినిధులు, వలంటీర్లు పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలో సేవా వజ్ర పురస్కారానికి దిగవల్లికి చెందిన కెత్తే సాయి లోహిత, సేవా రత్న పురస్కారానికి పల్లెర్లమూడికి చెందిన తాళం జీవన్‌కుమార్, సిలారపు ఉష, పోలసానపల్లికి చెందిన పులపాక అనిల్, అన్నవరానికి చెందిన మరీదు లక్ష్మి, గొల్లపల్లికి చెందిన నామాల గణేష్ ఎంపికయ్యారు. మిగిలిన వారందరూ సేవా మిత్రకు ఎంపికై నట్లు ఎంపీడీఓ తెలిపారు.

సారా మహమ్మారిని నిర్మూలించాలి

జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి



లబ్ధిదారులకు గ్రైండర్లు, కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి

మైలవరం: సారా మహమ్మారిని గ్రామ స్థాయిల్లో నిర్మూలించాలని రెడ్డిగూడెం జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కరరెడ్డి తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన పరివర్తన అనే కార్యక్రమంలో విజయభాస్కరరెడ్డి మాట్లాడారు. సారాకు దూరంగా ఉండాలనే ఉద్దేశంతో తయారీదారులపై రాష్ట ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. రెడ్డిగూడెం మండలంలోని కొన్ని గ్రామాలకు సంబంధించిన సారాను రూపుమాపే పరివర్తన కార్యక్రమంలో భాగంగా ప్రత్యమ్నాయంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. అందులో భాగంగా కుట్టు మిషన్లు, గ్రైండర్లు, హోటళ్లు నడుపుకునేందుకు అవసరమైన సామాన్లు దాతల సహకారంతో ఎస్ఈబీ అధికారులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎస్. శ్రీనివాసరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్(ట్రైనీ) జీవన్‌కుమార్, మైలవరం సీఐ గిరిజా సత్యకుమారి, తిరువూరు సీఐ బీ గురవయ్య, మైలవరం, తిరువూరు ఎస్సైలు అనిల్‌బాబు, శివప్రసాద్, రెడ్డిగూడెం సొసైటీ అధ్యక్షుడు బత్తుల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

23న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

విస్సన్నపేట: మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి అధ్యక్షతన ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ శనివారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి పురపాలక సంఘం పరిధిలో జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మేరా లైఫ్ మేరా స్వచ్ నగర్ (రెడ్యూస్, రీసైకిల్, రీయూస్, ఆర్‌ఆర్‌ఆర్) కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఆర్‌ఆర్‌ఆర్ కరపత్రాలు శనివారం ఆవిష్కరించారు. జూన్ 5వ తేదీ వరకు జరిగే కార్యక్రమంలో ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న దుస్తులు, చెక్క వస్తువులు, బూట్లు, చెప్పులు, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్స్ తదితర వస్తువులు ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌కు అప్పగిస్తే ఇతరులకు ఉపయోగపడతాయన్నారు.



ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్లు

సిరివెన్నెలకు స్వరాంజలి



సిరివెన్నెల సీతారామశాస్త్రి సినీ జీవిత విశేషాలు వివరిస్తున్న ఆశయ్య, వేదికమీద రసూల్ బాబు తదితరులు

విజయవాడ కల్చరల్: సినీ గేయ రచయిత, కవి సిరివెన్నెల సీతారామశాస్త్రి జయంతి సందర్భంగా మోహన్ కృష్ణా ఆర్ట్స్ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం సిరివెన్నెలకు అమర గాయకులకు స్వరాంజలి, తెలుగు సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. ఆ సంస్థ కార్యదర్శి బి.ఆశయ్య సిరివెన్నెల సీతారామ శాస్త్రి సినీరంగ సేవలను వివరించారు. సినీ సాహిత్యంలో సిరివెన్నెలు కురిపించిన రచయిత సీతారామ శాస్త్రి అని తెలిపారు. తెలుగు సినిమాలకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన కవి సిరివెన్నెలగా అభివర్ణించారు. మోహన్ కృష్ణా ఆర్ట్స్ అధ్యక్షురాలు బి.లక్ష్మీబాయి, కోశాధికారి మోహన్ కృష్ణానాయక్ పాల్గొన్నారు. ఆశయ్య ఆధ్వర్యంలో కృష్ణకుమారి, సువర్ణలక్ష్మి, శివనాగలక్ష్మి రూపశ్రీ, కృష్ణ సింధూ, రైల్వే శ్రీనివాస్. షేక్ రసూల్‌బాబు. రామశంకరావు పలు చిత్ర గీతాలను ఆలపించారు.

పర్యావరణ హితం- మన పరమ కర్తవ్యం

ముసునూరు: పర్యావరణ హితమే మనందరి పరమ కర్తవ్యమని, మొక్కల పెంపకంతోనే పర్యావరణ సమతుల్యం జరుగుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ధనలక్ష్మి పేర్కొన్నారు. పర్యావరణ వారోత్సవాల సందర్భంగా శనివారం మండలంలోని పలు అంగన్‌వాడీ ప్రాంగణాల్లో సిబ్బందితో కలిసి సూపర్‌వైజర్ మొక్కలు నాటారు.

గ్రంథాలయాల్లోని నీతి పుస్తకాలు చదవండి

ముసునూరు: ఉత్తమ వ్యక్తిత్వ నిర్మాణానికి గ్రంథాలయాలోని నీతి పుస్తకాలను చదవాలని పలువురు ఉపాధ్యాయులు సూచించారు. గోపవరం గ్రంథాలయంలో బ్రాంచి అధికారి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరంలో శనివారం నీతి కథల ప్రాధాన్యాన్ని చిన్నారులకు వివరించారు.

సర్వమంగళ స్వరూపుడు హనుమంతుడు

విజయవాడ కల్చరల్: సర్వమంగళ స్వరూపుడు హనుమంతుడని ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు అన్నారు. మల్లాది వేంకట సుబ్బారావు సుందరమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని సంగీత కళాశాలలో రెండురోజులపాటు నిర్వహించే హనుమత్‌వైభవం అంశం ఆధ్యాత్మిక కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ సర్వకాల సర్వావస్థలో హనుమంతుడు రామనామం జపించడమే విజయకారణమని నమ్మి మహిమ తెలుసుకున్నాడని తెలిపారు. హనుమంతుని పూజిస్తే రాముని పూజించినట్లేనని తెలిపారు. సర్వదేవతల శక్తులు హనుమంతునిలో ధారపోయాలని చతుర్ముఖ బ్రహ్మ అనుకున్నాడని వివరించారు. ధర్మానికి వ్యతిరేకంగా ఉండేవారిని హనుమంతుడు శిక్షిస్తాడన్నారు. హనుమ చెంతకు ఏ ఆయుధం చేరదని ఏ శక్తి అడ్డుకోలేదని తెలిపారు. ప్రజలు ఆధ్యాత్మికమైన మార్గం అనుసరించాలని సూచించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకుల కృషిని అభినందించారు. ప్రసంగం ప్రారంభంలో వేదపండితులు చాగంటి కోటేశ్వరరావును పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ట్రస్ట్ చైర్మన్ మల్లాది విష్ణుమాట్లాడుతూ ఏటా వైశాఖ మాసంలో ట్రస్ట్ ద్వారా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గతేడాది చాగంటితో దేవీవైభవం ప్రసంగం ఏర్పాటు చేశామని ముక్కోటి దేవతలు ఆరాధించేంది హనుమత్ స్వామినేనన్నారు.